క్లుప్తంగా

దేవాలయాల అభివృద్ధికి రూ. కోటి మంజూరు



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్, నాయకులు

మోతె : మండలంలోని సర్వారం, నర్సింహపురం గ్రామాల్లో గల దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రూ. కోటి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయనను కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిధులు మంజూరు చేస్తూ మంజూరు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట శీలం సైదులు, ఏలూరి వెంకటేశ్వరరావు ఉన్నారు.

బీసీలకు 50 శాతం కేటాయించాలి

గరిడేపల్లి : గృహలక్ష్మి పథకం కింద ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి ఇవ్వబోయే నగదును బీసీలకు 50 శాతం కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు కోరారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత 9 ఏళ్లుగా కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు మంజూరు చేయలేదన్నారు. ఇళ్లు కట్టుకోవడానికి రూ. 3 లక్షలు సరిపోవని రూ.5 లక్షలుఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల మంజూరులో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కడియాల అప్పయ్య, కనకయ్య, వెంకన్న, గోవిందు, తిరుపతయ్య, రమేష్ ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి



రిజిస్టర్లు పరిశీలిస్తున్న సీఐ వీర రాఘవులు

నడిగూడెం : శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నట్లు మునగాల సీఐ బీవీ.రాఘవులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో రిజిస్టర్‌లను తనిఖీ చేసి మాట్లాడారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక ఎస్‌ఐ పి.ఏడుకొండలు, తదితరులు ఉన్నారు.

పోస్టల్ బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న పోస్టల్ అధికారులు, ప్రజాప్రతినిధులు

మఠంపల్లి : మండలంలోని కొత్తదొనబండ తండా గ్రామానికి చెందిన బానోతు బాబు విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందాడు. కాగా అతని పేరుమీద రూ.399ల పోస్టల్ బీమా ఉండడంతో శుక్రవారం ఇండియన్ పోస్టల్, టాటా ఇన్సూరెన్సు ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి స్థానిక సర్పంచ్‌తో కలిసి రూ.10 లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సందీప్, సర్పంచ్‌లు బానోతు విజయబాలానాయక్, సుజాతాసక్రునాయక్, పోస్టల్ బ్యాంకు మేనేజర్ కళ్యాణ్, కోటయ్య, వీరేందర్, ఏపీఓ ఉమ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న శ్రీచరణ్

నడిగూడెం : సీఎస్‌సీ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ గవర్నెన్స్ జిల్లా అసిస్టెంట్ మేనేజర్ చీమ శ్రీచరణ్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురంలోని సీఎస్‌సీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎస్‌సీ కేంద్రం ద్వారా బ్యాంకింగ్, వ్యవసాయం, ఆరోగ్యం, బీమా, పింఛన్, తదితర సేవలు అందిస్తున్నారన్నారు. అనంతరం ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ పథకం కింద ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కలకొండ పుల్లమ్మ, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, ప్యానల్ లాయర్ మాచర్ల శ్రీనివాస్, సీఎస్‌సీ నిర్వాహకుడు మేకల నాగరాజు పాల్గొన్నారు.

భవనం శిథిలం.. వానొస్తే భయం

అవసాన దశకు చేరిన వ్యవసాయ ఏడీ కార్యాలయం

- పెచ్చులూడుతున్న పైకప్పు
- వానాకాలంలో చెమ్మగిల్లుతున్న భవనం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు



శిథిలావస్థకు చేరిన వ్యవసాయ సహాయ సంచాలకుడి కార్యాలయం, ఇన్‌సెట్‌లో పెచ్చులూడిన భవనం పైకప్పు

కోదాడరూరల్ : కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం శిథిలావస్థకు చేరింది. 52 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో అధికారులు సొంత ఖర్చులతో ఇటీవల పెచ్చులూడిన చోట తాత్కాలిక మరమ్మతులు చేయించారు. అయినా మరో చోట స్లాబ్ పెచ్చులూడి కిందపడుతుండటంతో కార్యాలయంలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో భవనం నీరు కారుతోందని, ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉందని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో నీరు చేరుతుందని, రికార్డులు తడిసే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కార్యాలయంలోని విలువైన రికార్డులు, కంప్యూటర్‌లు, ఫర్నిచర్‌కు కూడా సరియైన వసతులు లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులకు సౌకర్యాలు లేక తిప్పలు తప్పడం లేదు.

ఆరు మండలాలకు ఇక్కడి నుంచే..

కాగా, కోదాడ డివిజన్ పరిధిలోని ఆరు మండలాల్లో లక్ష 59 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలకు సంబంధించిన పలు కార్యాకలాపాలను ఈ ఏడీఏ కార్యాలయం నుంచే కొనసాగిస్తారు. అయితే ఏడాది కిందట నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందజేసిన వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయాన్ని కూల్చి నూతన భవనం నిర్మించాలని అధికారులు, రైతులు కోరుతున్నారు.

1988లో వ్యవసాయ శాఖకు..

కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో భాగమైన ఈ భవనాన్ని 1971లో రైతుల విశ్రాంతి భవనంగా నిర్మించారు. ఆ తర్వాత 1988లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కర్షక పరిషత్ పథకం కింద ఈ భవనాన్ని వ్యవసాయ శాఖకు అప్పగించారు. నాటి నుంచి ఈ భవనం వ్యవసాయ శాఖ కార్యాలయంగా కొనసాగుతోంది. ఏడీఏతో పాటు ఏట ఐదుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

నూతన భవనం నిర్మించాలి



కోదాడ వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. దానిని కూల్చి కొత్త భవనం నిర్మించాలి. అధికారులతో పాటు రైతులకు కూడా అన్ని వసతులతో అందుబాటులో ఉండే విధంగా భవనం నిర్మించాలి.
– కమతం వెంకయట్య, రైతు, తమ్మర

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం



కోదాడ వ్యవసాయ కార్యాలయం శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారులు తెలిపాం. నూతన భవనం మంజూరుకు నిధులు మంజూరు చేయాలని నివేదిక కూడా అందజేశాం. అధికారులు నిధులు మంజూరు చేస్తే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.
– టి.వాసు, ఏడీఏ, కోదాడ

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



కోదాడఅర్బన్ : శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కోదాడఅర్బన్ : కోదాడలోని బీజేపీ కార్యాలయంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొలిశెట్టి కృష్ణయ్య, సాతులూరి హనుమంతరావు, ఓరుగంటి పురుషోత్తం, నూనె సులోచన, యాదా రమేష్, కొండ్లే రవికుమార్, కనగాల నారాయణ, చలిగంటి ప్రమీల, పిచ్చయ్య, చిట్టిబాబు, శ్రీనివాసరావు, విశ్వేశ్వరరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖర్జీ ఆశయాలు కొనసాగించాలి

హుజూర్‌నగర్ : జన సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ముఖర్జీ బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని హుజూర్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జన సంఘ్‌ను స్థాపించి, దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందారని చెప్పారు. బీజేపీ మండల అధ్యక్షుడు కుందూరు కోటిరెడ్డి, నాయకులు డి.రామరాజు, జి.సతీష్, గోపి, ఉమామహేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉత్తమ్‌పై అసత్య ప్రచారం చేస్తే సహించం

గరిడేపల్లి : నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి జుట్టుకొండ సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత ఉద్యోగం వదిలి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం నచ్చి వచ్చి పార్టీ కోసం పనిచేస్తున్న, రాహుల్‌గాంధీ వీర విధేయుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అసత్య ప్రచారాలు మానుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమావేశంలో బల్లూరి అంజయ్య, చిత్తలూరి వెంకటేశ్వర్లు, ముత్తినేని సురేష్, పెండెం వీరస్వామి, బాదె నర్సయ్య, కీత వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య, నాగులుమీరా తదితరులు ఉన్నారు.

తాటిచెట్లు నరికిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో కల్లు పారే తాటి చెట్లను నరికిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎలుగూరి గోవిందు, మద్ది అంజిబాబు అధికారులను కోరారు. శుక్రవారం గ్రామానికి చెందిన భిక్షం పొలం వద్ద కాలువ ఒడ్డున ఉన్న 14 చెట్లను మిషన్ ద్వారా కోయించాడని తెలిపారు. ఈ విషయంపై రైతు వద్దకు వెళ్లి అడగగా అసభ్యకరంగా మాటాడాడని ఆరోపించారు. పొనుగోడులో 30 మంది గీత వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, తాటి చెట్లు నరకడంతో వారు జీవనాధారం కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మల సైదయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు సైదులు, శ్రీనివాస్, హుస్సెన్, పాపయ్య, వెంకయ్య, కృష్ణయ్య, పాపయ్య, లచ్చయ్య, వీరబాబు తదితరులున్నారు.

ఫీజుల నియంత్రణకు సమగ్ర చట్టం తేవాలి

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేటు స్కూల్, కాలేజీలలో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం సమగ్ర చట్టం తేవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యా సంస్థలు డబ్బే ప్రధానంగా టెక్నో, ఈ టెక్నో తదితర ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నారని, ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేస్తూ బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరీ అమ్ముతున్న ప్రైవేటు పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, నందు, గోపి, లోకేష్, భాను, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

మునగాల : మండలంలోని మాధవరం గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎదురుగా నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో విద్యుత్ తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు తెలిపినా వారు పట్టించుకోవడం లేదని గ్రామసర్పంచ్ నంద్యాల విజయలక్ష్మి తెలిపారు. విద్యుత్ వైర్లు తెగేలా ఉన్నాయని తెగి కిందపడితే పాఠశాలకు వచ్చే విద్యార్థులతో పాటు నేలమర్రి గ్రామానికి వెళ్లే ప్రజలకు ప్రమాదం జరిగే పరిస్థితి ఉందని తెలిపారు. తక్షణమే యుద్ధప్రాతిపదికన విద్యుత్ తీగలను సరిచేయాలని కోరారు.

సమ్మె నోటీస్ అందజేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 24న మండలంలోని గ్రామ పంచాయతీల బిల్ కలెక్టర్ల సదస్సు, జూలై 6 నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి కార్యాలయంలో వారు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా రగ్బీ అసోసియేషన్ చైర్మన్, సర్పంచ్

మఠంపల్లి : 37వ అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఒలింపిక్ రన్‌ను జిల్లా రగ్బీ చైర్మన్, స్థానిక సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల క్రీడాకారులు, రగ్బీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఈ రన్‌లో పాల్గొన్నారు. విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించాలని పలువురు కోరారు. కార్యక్రమంలో సెయింటాన్స్ యాజమాన్యం సిస్టర్స్ రూబీ, సుజాత, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, రగ్బీ జిల్లా ప్రధాన కార్యదర్శి తరుణ్‌రెడ్డి, రిటైర్డ్ పీఈటీ బాల్‌రెడ్డి, పీఈటీలు జయ, సతీష్, శ్రీను, స్వర్ణ, నాగరాజు, నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

బోనమెత్తిన గోపాలపురం



బోనాలతో బొడ్రాయి వద్దకు తరలివెళ్తున్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో బొడ్రాయి ప్రతిష్ఠించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం గ్రామ ప్రజలు బోనాలతో తరలివెళ్లి బొడ్రాయికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పాడిపంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసనాల నాగసైదయ్య, ఎంపీటీసీ చీకూరి రాజారావు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలి

నేరేడుచర్ల : అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారెపల్లి శేఖర్‌రావు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం అరిబండి భవన్‌లో జరిగిన పట్టణ పార్టీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 3 వేల మందికి మాత్రమే గృహలక్ష్మి పథకం అమలు చేస్తామని అనడం సరైంది కాదన్నారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నగేష్, నాయకులు తిరుపతయ్య, రామ్మూర్తి, మీనయ్య, ఆఫీజ్, సైదులు, వరలక్ష్మి, కృష్ణవేణి, శ్రీను తదితరులున్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

నడిగూడెం : ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు అవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం, కరివిరాల గ్రామాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు షేక్.లతీఫ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రవి, నాగేంద్ర, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

గరిడేపల్లి : రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య కోరారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్తీక్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలను నియంత్రించాలని కోరారు. సీఎం కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం లక్షలోపు రుణాలను ఏక కాలంలో రద్దు చేసి రైతులకు కొత్త రుణాలు అందించాలన్నారు. సాగర్ ఎడమ కాలువపై ఉన్న లిఫ్ట్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రభుత్వం పంటల ధరలపై కేంద్రానికి సిఫారసు చేసి మద్దతు ధర ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు పారేల్లి నాగడయ్య, డివిజన్ కార్యదర్శి మేకల కనకారావు, జిల్లా నాయకులు వల్లపుదాసు రాజు, వీసాల వెంకటేశ్వర్లు, మాశెట్టి అంజయ్య, ఆదూరి శ్రీను, బ్రహ్మయ్య, అంజయ్య, వెంకన్న, నగేష్ తదితరులున్నారు.

ప్రభుత్వం 'ఉపా' చట్టాన్ని రద్దు చేయాలి



అఖిల పక్షం సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రామారావు

కోదాడఅర్బన్ : ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నిస్తూ ఉద్యమాలు చేస్తున్న వారిపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక (ఉపా) చట్టం ప్రయోగించి జైల్లో పెట్టి చిత్రహింసలు పెడుతున్నారని, ఉపా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పబ్లిక్ క్లబ్‌లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవీటి రామారావు అధ్యక్షతన ఉపా చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు పార్టీల, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాలనపై ప్రశ్నించే వారు, ప్రజాస్వామ్య వాదులు, మేధావులపై దేశ ద్రోహం కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ఉపా చట్టం ప్రయోగించి అరెస్ట్ చేసిన వారందనీ వెంటనే బేషరుత్తుగా విడుదల చేయాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, ప్రజ సంఘాల ఆధ్వర్యంలో ఉపా చట్టం రద్దు కోసం పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సీహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, పారా సీతయ్య, వక్కవంతుల కోటేశ్వరరావు, ప్రసాద్, బంగారు నాగమణి, తోట రంగారావు, మేకల శ్రీను, పిల్లుట్ల శ్రీనివాస్, రాయపూడి చిన్ని, ముత్తినేని సైదేశ్వరరావు, ముత్యాలు, నంబూరి సూర్యం, నరసింహారావు, రాఘవరెడ్డి, ఉప్పగండ్ల శ్రీను, నాగేందర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అభినవ్



అభినవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారుడు మేకల అభినవ్ 33వ జయంతిని శుక్రవారం కోదాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఎదుట గల అభినవ్ విగ్రహానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి అభినవ్ అని అన్నారు. ఆయనను క్రీడాకారులు ఆదర్శంగా తీసుకుని చదరంగంలో రాణించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, పారా సీతయ్య, వంగవీటి రామారావు, ఆర్.సీతారామయ్య, బి.కృష్ణయ్య, ఎం.సైదేశ్వరరావు, నయీం, చంతాబాబు, వి.శ్రీనివాసరావు, తిరపయ్య, నర్సింహారావు, బాగ్దాద్, జనార్దన్, చందర్‌రావు, శ్రీను, పాండు, రంగారావు, నిరంజన్‌రెడ్డి రాజు, ఉప్పగండ్ల, రాంబాబు, మేకల వెంకటేశ్వర్లు, అరుణ, క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించాలని నిరసన



నిరసన తెలుపుతున్న స్థానికులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని 14, 15వ వార్డుల పరిధిలోని ఎస్‌ఆర్ ఫ్రైడ్ బజారులో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆ కాలనీవాసులు శుక్రవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేరేడుచర్ల గ్రామ పంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి మున్సిపాలిటీగా ఏర్పడే వరకు ఎస్‌ఆర్ ఫ్రైడ్ ఫంక్షన్ బజారులో పాలకులు డ్రైయినేజీ ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. జాన్‌పహాడ్ రోడ్డు నుంచి మిర్యాలగూడ రోడ్డును కలిపే ఈ రోడ్డుపై మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బోనగిరి అంజయ్య, సుంకరి క్రాంతికుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, కిరణ్‌కుమార్, రాంబాబు, ప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు, సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు.

ఘనంగా పంచపాండవుల పండుగ



వేడుకల్లో పాల్గొన్న ముదిరాజ్‌లు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తులు పంచ పాండవుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచ పాండవులను పూజించారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుతూ పాండువుల బండపై జోరు పాశం పోసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు కార్తీక్, హనుమంతరావు, అలవాల రాజు, తమ్మనబోయిన శంకర్, బుడిగె సురేష్, ధోని, మునిశ్రీను, బుడిగెం వెంకన్న, తమ్మనబోయిన వీరబాబు, ముసి మట్టయ్య, దేశబోయిన జానకీరాములు, అల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సహస్ర కుంకుమార్చనలు



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో సహస్ర కుంకుమార్చనలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళాశాసనం, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకుడు హరీష్‌కుమార్‌చార్యులు, యరగాని కిరణ్‌కుమార్‌గౌడ్, ఉపేందర్, రమేష్, భక్తులు, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని 16వ వార్డుకు చెందిన ఉప్పల వీరాభద్రంకు మంజూరైన రూ.20 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అమర్‌గౌడ్, రాము తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

హుజూర్‌నగర్ : పట్టణంలోని సక్సెస్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు హరి హరన్, సాయి రీషిక్, యువంత్‌లు నవోదయ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం వారిని కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా కొల్లు నర్సయ్య



నర్సయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చిలుకూరు : తెలుగుదేశం పార్టీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా చిలుకూరు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కొల్లు నర్సయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా చిలుకూరులో ఆయనను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పార్టీ జిల్లా, మండల నాయకులు దొడ్డా గురవయ్య, జనపనేని కృష్ణారావు, వేమూరి సురేష్, శ్రీమన్‌నారాయణ, వీరబా బు, భాస్కర్, మస్తాన్, సుల్తాన్ అచ్చయ్య, రోశయ్య పాల్గొన్నారు.

కార్యనిర్వాహక కార్యదర్శిగా చిన్న కోటిరెడ్డి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడుకు చెందిన పంట చిన్న కోటిరెడ్డిని టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కోటిరెడ్డి స్థానిక విలేకరులకు తెలిపారు. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్‌కు చెందిన సోమగాని నరేందర్‌గౌడ్‌ను టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా నియమించారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండవ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన మండవ వెంకటేశ్వర్లుగౌడ్ టీడీపీ నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు శుక్రవారం వెంకటేశ్వర్లుగౌడ్ స్థానిక విలేకరులకు తెలిపారు.